

చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.4°/ 18.7°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఎంటెక్ ఒకటో సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ఎంటెక్ ఒకటో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్ పరీక్ష ఫలితాలు విడుదల య్యాయి. వర్సిటీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ఫలితాలను విడుదల చేశారు. ఈ నెల 12న ప్రారంభమైన సెమిస్టర్ 14వ తేదీన ముగిసింది. ఈ క్రమంలో కేవలం 13 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం గమనార్హం. ఇందుకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి. విష్ణు వర్ధన్, డాక్టర్ డి. లలిత కుమారిని ప్రిన్సిపాల్ అభినందించారు. విద్యార్థులు మార్కులు తెలుసుకునేందుకు కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి, పాలక మండలి సభ్యులు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ జి.మమత, అజిత ప్రొఫెసర్ ఆర్.భువన విజయ, డాక్టర్ ఓం ప్రకాష్, డాక్టర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

‘టెట్’ ప్రారంభం

- తొలిరోజు 322 మంది గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మంగళవారం ప్రారంభమైంది. జిల్లాలో తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. అనంతపురం నగరంలో ఆరు, తాడిపత్రిలో రెండు, గుత్తిలో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. తొలిరోజు 322 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 1,359 మందికి గాను 1,191 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 1365 మందికి గాను 1211 మంది హాజరయ్యారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు.

ఏసీబీ వలలో ఆర్ఐ

- రూ.6 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



ఏసీబీ అధికారులకు చిక్కిన ఆర్ఐ శ్రవణం క్రాంతికుమార్ (కూర్చొన్న వ్యక్తి)

పామిడి: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) శ్రవణం క్రాంతికుమార్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) గాలానికి చిక్కారు. మ్యుటేషన్ కోసం రైతుల నుంచి రూ.6 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల కథనం మేరకు.. పామిడి మండలం అనుంపల్లికి చెందిన రైతు కె.శేషాద్రి కొన్నిరోజుల క్రితం గ్రామ సర్వేనెంబర్లు 340, 341లోని దాదాపు ఏడెకరాల భూమిని తన భార్య కె.జయలక్ష్మి, తమ్ముడు సుంకయ్య భార్య కె.గంగేశ్వరమ్మ పేర చెరి సగం చొప్పున మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేశారు. ఇందుకు ఆర్ఐ శ్రవణం క్రాంతికుమార్ ఆ ఇరువురి పేర మ్యుటేషన్ చేయడానికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రూ.3 వేల చొప్పున మొత్తం రూ.6 వేలకు డీల్ కుదిరింది. అయితే.. లంచం ఇవ్వడానికి ఇష్టపడని శేషాద్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే ఏసీబీ అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రైతు శేషాద్రిని ఆర్ఐ వద్దకు పంపారు. శేషాద్రి నుంచి క్రాంతికుమార్ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వసతులు పక్కా.. ఇళ్లు చకచకా



- ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ సమీపంలోనిది. 120 ఎకరాల సువిశాల విస్తీర్ణంలోని లే అవుట్‌లో దాదాపు 3 వేల మందికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. అక్కడ నివసించే వారు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. రూ.2.50 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మించింది.అంతేకాకుండా తాగునీటి అవసరాల కోసం ప్రత్యేకంగా బోర్లు, ట్యాంకులు ఏర్పాటు చేసింది. రోడ్ల నిర్మాణం చేపట్టింది.



తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామంలో నిర్మించిన జగనన్న ఇళ్లు



- ఇది కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి జగనన్న లే అవుట్. కళ్యాణదుర్గం పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇక్కడ పట్టాలను మంజూరు చేశారు. కొందరు ఇళ్లు సొంతంగా కట్టుకుంటుండగా, చాలామందికి ప్రభుత్వమే నిర్మిస్తోంది. లబ్ధిదారుల కోసం విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులను కల్పించింది. దీంతో ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చక చకా సాగుతున్నాయి. ఇప్పటికే పలువురు నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు చేశారు. వసతులన్నీ ఉండడంతో హాయిగా జీవనం సాగిస్తున్నారు.

- జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన
- రూ.100 కోట్లతో సమకూర్చిన సర్కారు
- లబ్ధిదారులకు ఇబ్బందుల్లేకుండా చేయూత

జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లు	412
మంజూరైన ఇళ్లు	41,392
నిర్మాణాలు పూర్తి చేసుకున్నవి	9,482
వివిధ దశల్లో ఉన్నవి	31,477

అనంతపురం టౌన్: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు’ పథకాన్ని ప్రవేశ పెట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ స్థలం కేటాయించింది. ఆర్థిక స్తోమత లేని వారికి ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. తమకు నచ్చినట్లుగా ఇల్లు నిర్మించుకుంటామని చెప్పిన వారికి చేయూతనందిస్తోంది. సకాలంలో ఇంటి పనుల బిల్లులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ ప్రభుత్వం రూ.370 కోట్లు లబ్ధిదారులకు అందించింది.

రూ.100 కోట్లతో వసతులు..

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగంగా చేపట్టాలన్న ఉద్దేశంతో జగనన్న లేఅవుట్లలో విద్యుత్, తాగునీరు, రహదారులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రూ.100 కోట్లకు పైగా నిధులతో లే అవుట్లలో మౌలిక వసతులు కల్పించింది. ప్రభుత్వ అండతో ఇప్పటికే జిల్లాలో 9,482 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏక కాలంలో లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టింది. ఒక్క ఆలమూరు లేఅవుట్‌లోనే 2,500 మంది లబ్ధిదారులు తమ కలల ఇళ్లలోకి ఆనందంగా అడుగు పెట్టారు. లే అవుట్లలో అన్ని రకాల వసతులు ఉండడంతో హాయిగా జీవనం సాగిస్తున్నారు.

మా పాలిట దేవుడు జగన్



దాదాపు 15 ఏళ్లు అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీశాం. నా భర్త శ్రీనివాసులు బొరుగుల బట్టీలో కార్మికుడిగా పనిచేస్తాడు. టీడీపీ హయాంలో దాదాపు 10 సార్లు అర్జీ ఇచ్చినా ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఇంటి స్థలం మంజూరు చేశారు. ప్రభుత్వ భరోసాతో రుణం కూడా అందడంతో బీటీపీ లేఅవుట్‌లో ఇంటిని నిర్మించుకున్నాం. జగనన్న వచ్చాకే మాకు రేషన్ కార్డు కూడా మంజూరైంది. మా పాలిట దేవుడు జగనన్నే.

– కళావతి, రాయదుర్గం పట్టణం

ప్రత్యేక నిధులతో వసతుల కల్పన

జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా వసతులు కల్పించాం. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలోని అన్ని లే అవుట్లలో సౌకర్యాలు త్వరితగతిన సమకూర్చాం.

– నరసింహారెడ్డి, పీడీ, హౌసింగ్

కల నెరవేర్చారు



వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత సొంతింటి కల నిజమైంది. గ్రామంలో స్థలం కేటాయించడమే కాకుండా హౌసింగ్ పథకం కింద ఇంటిని నిర్మించుకునే అవకాశం కల్పించారు. పేదల సంక్షేమం గురించి ఆలోచించే గొప్ప వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం మా అదృష్టం.

– లక్ష్మీనరసమ్మ,కసాపురం, గుంతకల్లు మండలం

సంతోషంగా జీవిస్తున్నా



తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె వద్ద ఇంటి స్థలం మంజూరైంది. నీరు, విద్యుత్తు వసతిని అధికారులు కల్పించారు. ప్రభుత్వం నుంచి దాదాపు రూ. 2 లక్షల వరకూ ఇంటి బిల్లులు అందాయి. నేను, నా కుమారుడు కష్టపడి సంపాదించిన సొమ్మును దానికి జత చేసి రూ. 8 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేశా. ప్రభుత్వం నుంచి పింఛన్ అందుతోంది. ఆ డబ్బుతో సంతోషంగా జీవిస్తున్నా. నేనే కాదు, నా లాంటి ఎందరో మహిళలకు సీఎం జగన్ అండగా నిలిచాడని గర్వంగా చెబుతా.

– పూజారి బాలమ్మ, తాడిపత్రి



ఆలమూరు జగనన్న లే అవుట్‌లో నిర్మించిన ఇళ్లు

ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

అనంతపురం: ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో మంగళవారం ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై ప్రభుత్వ శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజీమార్గంలో సమస్య పరిష్కారానికి శాశ్వత లోక్ అదాలత్ కృషి చేస్తుందన్నారు. రాజీ కుదరని పక్షంలో తీర్పు వెలువరించగల అధికారం కలిగి ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జే. శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవల కేసుల్లో లోక్ అదాలత్ తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందన్నారు. ఇది అప్పీలు లేని శాశ్వత తీర్పు అవుతుందన్నారు. రూ. కోటి పరిహారం వరకూ తీర్పు వెలువరించగల అధికారం కలిగి ఉంటుందన్నారు. ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్ అదాలత్‌లో ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు ఎం. రాజశేఖర్ రెడ్డి, ఎంవీఎల్‌ఏ శ్రీనివాస రావు, సీనియర్ న్యాయవాది పద్మజ, ప్రభుత్వ ఆసుపత్రి, విద్యుత్‌శాఖ, మున్సిపల్ కార్పొరేషన్, ఆర్టీసీ, ఎల్ఐసీ, పోస్టల్, హౌసింగ్, డ్వామా, విద్య తదితర శాఖల అధికారుల పాల్గొన్నారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

అనంతపురం సిటీ: జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జెడ్పీ సీఈఓ నిదియాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. స్థాయీ సంఘం–1, 2, 3, 4, 5, 6, 7 (ఆర్థిక, ప్రణాళిక/ఇంజినీరింగ్ విభాగాలు/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/స్త్రీ, శిశు సంక్షేమం/ వ్యవసాయం/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సహా ఇతర స్థాయీ సంఘాల చైర్మన్ల అధ్యక్షతన కార్యక్రమాలు సాగుతాయన్నారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించి సమగ్ర వివరాలతో అధికారులు హాజరుకావాలని సీఈఓ ఆదేశించారు.

3 నుంచి పల్స్ పోలియో

- 2,79,980 మంది చిన్నారులకు చుక్కల మందు పంపిణీకి ప్రణాళిక

అనంతపురం మెడికల్: పల్స్ పోలియో కార్యక్రమం జిల్లావ్యాప్తంగా ఈ నెల 3న ప్రారంభం కానుంది. కలెక్టర్ గౌతమి ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 2,79,980 చిన్నారులకు 3,80,000 డోసుల పంపిణీ లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. ‘పల్స్ పోలియో’ విజయవంతానికి సంబంధించి ఇప్పటికే డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ మెడికల్ ఆఫీసర్లు, ఇతర అధికారులకు శిక్షణ ఇచ్చారు.

6,970 సిబ్బందితో..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉండే చిన్నారులందరికీ 3 దశల్లో పోలియో చుక్కలు వేయనున్నారు. అందుకోసం జిల్లాలో 1,785 బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్లు 120 మంది, కోర్ గ్రూప్ ఆఫీసర్లు 10, సూపర్‌వైజర్లు 264, ఆశా వర్కర్లు–1,989, ఏఎన్‌ఎంలు– 663 మొత్తంగా 6,970 మంది సిబ్బంది కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు. 68 మొబైల్ బృందాలు హైరిస్క్ ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. 58 బృందాలు బస్టాండ్లు, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లు తదితర ప్రాంతాల్లో పోలియో చుక్కలు పంపిణీ చేయనున్నాయి. ఒక వేళ ఎవరైనా తమ చిన్నారికి మార్చి 3న చుక్కలు వేయించకుంటే తర్వాతి రెండు రోజులు ఆశా, ఏఎన్‌ఎంలు ఆ ఇంటికే వెళ్లి అందించేలా ఏర్పాట్లు చేశారు.



అర్బన్ మెడికల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహిస్తున్న డాక్టర్ యుగంధర్

బాధ్యతగా వేయించండి

మార్చి 3న జిల్లావ్యాప్తంగా పోలియో చుక్కల పంపిణీ ప్రారంభిస్తాం. ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశాం. మార్చి 4, 5వ తేదీల్లోనూ ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో డ్రాప్స్ అందిస్తారు. తల్లిదండ్రులు బాధ్యతగా చిన్నారులకు చుక్కల మందు వేయించాలి. – డాక్టర్ యుగంధర్,డీఐఓ

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో పలువురు మున్సిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న పి.కిశోర్‌ను రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడ ఉన్న మహ్మద్ షేక్ మాలిక్‌ను సీడీఎంఏలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జి.రవిని ఆమిదాలవలసకి బదిలీ చేశారు. ఆ స్థానంలో నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఎం.రామ్మోహన్‌రావును నియమించారు.

ఏపీఎంఐపీ పీడీగా రఘునాథరెడ్డి



అనంతపురం అగ్రికల్చర్: ఏపీఎంఐపీ పీడీగా బి.రఘునాథరెడ్డి నియమితులయ్యారు. కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఆండాలును ఉద్యానశాఖ ఇన్‌చార్జ్ డీడీగా నియమించారు. ఈ మేరకు ఉద్యానశాఖ కమిషనరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బి. రఘునాథరెడ్డి ప్రస్తుతం ఉద్యానశాఖ ఏడీగా పనిచేస్తున్నారు. ఆయనకు పదోన్నతి కల్పించి పీడీగా బదిలీ చేశారు. ఏపీఎంఐపీకి ఇన్‌చార్జ్‌గా ఉన్న జి.ఫిరోజ్‌ఖాన్ స్థానంలో రఘునాథరెడ్డి బాధ్యతలు తీసుకోనున్నారు.

నేడు ‘వైఎస్సార్ రైతు భరోసా’ విడుదల



అనంతపురం అగ్రికల్చర్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. ఏటా వివిధ పథకాల కింద క్రమం తప్పకుండా సాయం అందిస్తున్నారు. ‘నవరత్నాల’లో భాగంగా ఏటా ప్రతి రైతుకూ పెట్టుబడి సాయంగా రూ.13,500ను ఒక్క విడత కూడా జాప్యం చేయకుండా అందిస్తున్నారు. ఈ క్రమంలోనే వరుసగా ఐదో ఏడాది లబ్ధి చేకూర్చేందుకు సర్వం సిద్ధం చేశారు. బుధవారం బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,94,353 మంది రైతులకు రూ.59.01 కోట్ల పెట్టుబడి సాయం మంజూరైంది. ఇందులో కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా 2,794 మంది కౌలు రైతులకు రూ.69 లక్షలు, 225 మంది అటవీ భూముల సాగుదారులకు రూ.50 వేలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. మొత్తమ్మీద ఈ ఏడాది మూడు విడతల్లో జిల్లా రైతులకు రూ.395.18 కోట్ల పెట్టుబడి సాయం అందింది.

కళ్యాణదుర్గం.. అత్యధికం

‘వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్’ కింద కళ్యాణదుర్గం నియోజక వర్గంలో అత్యధికంగా 55,097 మంది రైతులకు రూ.2 వేల చొప్పున రూ.11.05 కోట్లు విడుదల కానుంది. ఆ తర్వాత శింగనమలలో 54,595 మందికి రూ.10.92 కోట్లు, ఉరవకొండ– 51,030 మందికి రూ.10.22 కోట్లు, రాయదుర్గం– 46,034 మందికి రూ.9.24 కోట్లు, తాడిపత్రి– 32,606 మందికి రూ.6.52 కోట్లు, గుంతకల్లు– 30,209 మందికి రూ.6.07 కోట్లు, రాప్తాడు– మూడు మండలాల్లో 24,782 మంది రైతులకు రూ.4.97 కోట్లు విడుదల చేయనున్నారు.

సున్నావడ్డీ కింద 17.25 కోట్లు..

‘వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్’ కింద పెట్టుబడి సాయంతో పాటు వైఎస్సార్ పంట రుణాల సున్నావడ్డీ పథకం కింద అర్హులైన 83,314 మంది రైతులకు రూ.17.25 కోట్ల మేర వడ్డీ రాయితీ సొమ్మును సీఎం వైఎస్ జగన్ జమ చేయనున్నారు. 2021 రబీ, 2022 ఖరీఫ్‌లో బ్యాంకుల ద్వారా రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీరాయితీ అందనుంది.

గిట్టుబాటు ధరలు.. క్రమం తప్పకుండా బిల్లులు



రాప్తాడు: హంపాపురంలో పాల సేకరణను పరిశీలిస్తున్న జేసీ కేతన్ గార్గ్

రాప్తాడు/బుక్కరాయసముద్రం: ‘జగనన్న పాలవెల్లువ’ కార్యక్రమంలో భాగంగా పాడి రైతుల నుంచి గిట్టుబాటు ధరతో పాలు సేకరించడంతో పాటు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించనున్నట్లు జేసీ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. రాప్తాడు మండలంలోని హంపాపురం, బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులో మంగళవారం నిర్వహించిన ‘జగనన్న పాలవెల్లువ’ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అనంతపురం, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, రాప్తాడు, నార్పల మండలాల్లో 98 ఏఎంసీయులు, 2 బీఎంసీయుల ద్వారా పాలసేకరణ ప్రారంభమైందని తెలిపారు. 5 మండలాల పరిధిలో 8 వేల నుంచి 9 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మంగళవారం దాదాపు 335 మంది నుంచి 1,879 లీటర్ల పాలు సేకరించామన్నారు. రోజూ గ్రామాల్లో ఉదయం , సాయంత్రం పాలు సేకరిస్తారన్నారు. ధరల సమాచారాన్ని పాడి రైతుల మొబైల్‌కు పంపుతామన్నారు.15 రోజులకోసారి బిల్లులు బ్యాంకు ఖాతాలకు జమవుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, సర్పంచు గౌరవ లక్ష్మీదేవి, ఎంపీపీ సునీత తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం

ఆత్మకూరు: పాడి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని 14 గ్రామాల్లో ‘జగనన్న పాలవెల్లువ’ కార్యక్రమం ప్రారంభమైంది. పంపనూరు తండా గ్రామంలో పీడీ నరసింహారెడ్డి, ఎంపీపీ హేమలత ఆధ్వర్యంలో ‘జగనన్న పాల వెల్లువ డెయిరీ’ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు డెయిరీల కన్నా ఎక్కువ ధరతో పాలు సేకరిస్తారన్నారు. ఎంపీడీఓ దశరథరామయ్య, ఏపీఎం మదన్‌మోహన్, వెటర్నరీ డాక్టర్ తులసీరామ్, తేజశ్విని తదితరులున్నారు.

తొలిరోజు 3,600 లీటర్ల సేకరణ

అనంతపురం అగ్రికల్చర్: ‘జగనన్న పాల వెల్లువ’ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు జిల్లాలో 3,600 లీటర్ల పాలు సేకరించినట్లు పశుశాఖ కమాండ్ కంట్రోల్ రూమ్ వర్గాలు వెల్లడించాయి. అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, నార్పల, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో 54 ఆర్బీకేల పరిధిలో ఉన్న 98 గ్రామాల నుంచి ‘అమూల్’ సహకారంతో ‘జగనన్న పాల వెల్లువ’ ప్రారంభించినట్లు తెలిపారు. తొలిరోజే పాడిరైతుల నుంచి ఆశించిన స్పందన వచ్చిందన్నారు. రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే కమాండ్ కంట్రోల్ రూమ్ 9391909449 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

తాడిపత్రికి బ్రహ్మోత్సవ శోభ

- 3 నుంచి బుగ్గరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- 13వ తేదీ వరకూ విశేష వాహన సేవలు
- చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

తాడిపత్రి అర్బన్: దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేకతను సంపాదించుకున్న తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. దీంతో తాడిపత్రిలో బ్రహ్మోత్సవ శోభ ఉట్టిపడుతోంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఏటా మాఘ బహుళ అష్టమి నుంచి ఫాల్గుణ శుద్ధ తదియ వరకూ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఉత్సవాలు ఇలా...

మార్చి 3న సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. 4న సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి చిత్ర గోపుర గ్రామోత్సవం, 5న ఉదయం వాసుకీ వాహనం, రాత్రికి శేషవాహనం, 6న సింహవాహనం, 7న నరమృగ వాహనం, 8న శుక్రవారం త్రయోదశి మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నంది వాహనం, రాత్రి అధికార నంది వాహనం, రాత్రి 11 గంటలకు శివజ్యోతి దర్శనం, రాత్రి 12గంటలకు లింగోద్భవం, 9న గజ వాహనం, 10వ తేదీ ఆదివారం అమావాస్య రోజున ఉదయం 9గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, మధ్యాహ్నం 2గంటలకు మహారథోత్సవం, 11న రాత్రి అశ్వవాహనం, 12న వసంతోత్సవం, హంసవాహనం, 13న ఏకాంత్సోవ సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

దక్షిణ కాశీగా ఖ్యాతి

పెన్నానది ఒడ్డున వెలసిన బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం ఎన్నో ప్రత్యేకతలకు నెలవుగా భాసిల్లుతోంది. ఆలయం పక్కనే ప్రవహిస్తున్న పెన్నానది ఉత్తర వాహినిగా ఉండడం గమనార్హం. కాశీలోనూ గంగా నది ఉత్తర వాహినిగా ఉంటోంది. కాశీలో విశ్వనాథుడి ఆలయం పక్కనే శ్మశాన వాటిక ఉన్న రీతిలోనే బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం పక్కన ఉండడం విశేషం. ఆలయంలో బుగ్గరామలింగేశ్వరుడు దక్షిణాభిముఖంగా వెలసి ఉన్నాడు. దీంతో ఈ ఆలయాన్ని దక్షిణ కాశీగా పిలుస్తుంటారు. త్రేతాయుగంలో యాగ పరిరక్షణలో భాగంగా తాటకిని సంహరించిన అనంతరం స్త్రీ హత్య దోష నివారణకు అప్పటికే స్వయంభూ గా వెలసిన బుగ్గరామలింగేశ్వరుడికి రామలక్ష్మణులతో విశ్వామిత్రుడు విశేష పూజలు చేయించినట్లు ఇతిహాసం చెబుతోంది. లింగోద్భవ స్థానంలో బుగ్గ నుంచి నిరంతరం నీరు ఉబికి వస్తుండడం ఈ ఆలయంలోని మరో విశేషం.



ప్రత్యేక అలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు



విశేష అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి

మహా శివరాత్రి రోజున లింగోద్భవం, జ్యోతి దర్శనం

మహా శివరాత్రి పర్వదినాన రాత్రి 11 గంటలకు లింగోద్భవ కాలమందు జ్యోతి దర్శనం ఉంటుంది. రాత్రి 12 గంటలకు లింగోద్భవ దర్శనాన్ని ప్రతి ఒక్కరూ దర్శించుకునేలా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఎల్‌ఈడీ టీవీలను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాటు చేస్తున్నారు.

ఆలయానికి ప్రత్యేకత ఉంది



ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. బుగ్గ రామలింగేశ్వరుడు దక్షిణాభిముఖంగా వెలసి ఉన్నాడు. ఈ ఆలయాన్ని జనమేజయ మహారాజు కట్టించినట్లుగా చరిత్ర చెబుతోంది. ఆ సమయంలోనే మహారాజు సైతం మరో శివలింగాన్ని దక్షిణ దిశలో ప్రతిష్టించి వెళ్లారు. పురాతన చరిత్రకు, విశిష్టతకు సాక్షిగా నిలిచిన ఈ ఆలయం పెన్నానది ఒడ్డున ప్రశాంత వాతావరణంలో ఉంది. బుగ్గ రామలింగేశ్వరుడిని పూజిస్తే సకల దోషాలు హరిస్తాయని ఇతిహాసాలు చెబుతున్నాయి.

– ఎం.చంద్రశేఖరశర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

సర్వదర్శనానికే అధిక ప్రాధాన్యం

సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వామి దర్శన ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలైన్లు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం.

– పోలిశెట్టి ఆంజనేయులు, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు



బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం



భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, చలువ పందిళ్లు

క్లుప్తంగా

పొరపాట్లకు తావివ్వకండి



ఎపిక్ కార్డులను సిద్ధం చేస్తున్న ఎన్నికల సిబ్బంది

అనంతపురం అర్బన్: ఓటర్లకు ఎపిక్ కార్డులు చేర్చే క్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని ఎన్నికల సిబ్బందికి కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ రవికుమార్ సూచించారు. పోస్టల్ ద్వారా ఎపిక్ కార్డులను ఓటర్లకు పంపించే ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎపిక్ కార్డు కవర్‌పైన డిస్పాచ్ క్లర్క్ సీల్, పోస్టల్ బ్యాచ్ సీల్ తప్పక వేయాలని ఆదేశించారు. ప్రతి ఎపిక్ కార్డ్ బార్ కోడ్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలన్నారు. మొత్తం 2.30 లక్షల ఎపిక్ కార్డులకు గానూ ఇప్పటి వరకూ 1.08 లక్షలు జిల్లాకు వచ్చాయన్నారు. వీటిని పోస్టల్ ద్వారా ఓటర్లకు పంపించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

ఆటో బోల్తా - చిన్నారి మృతి



మృతి చెందిన బేబి

బ్రహ్మసముద్రం: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ చిన్నారి మృతి చెందింది. మరో పది మంది గాయపడ్డారు. వివరాలు... బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన కొందరు సోమవారం రాత్రి దొడగట్టలో నిర్వహించిన క్రైస్తవ ప్రార్థన సభకు వెళ్లారు. ప్రార్థన ముగించుకున్న అనంతరం రాత్రి 12 గంటలకు ఆటో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. గొంచిరెడ్డిపల్లి – నాగిరెడ్డిపల్లి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో చిన్నారి బేబి (2) మృతి చెందింది. చిన్నారి తల్లి గంగమ్మ, ఆటో డ్రైవర్ రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. మరో పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా నగేష్



ఎం.నగేష్

అనంతపురం అగ్రికల్చర్: మత్స్యకార సహకార సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన ఎం.నగేష్ ఎన్నికయ్యారు. హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో ఎన్నికల అధికారి ఫక్కీరప్ప ఆధ్వర్యంలో ప్రక్రియ నిర్వహించారు. అధ్యక్ష స్థానంతో పాటు ఉపాధ్యక్షుడిగా శింగనమలకు చెందిన బెస్త వెంకటనారాయణతో పాటు మరో 9 మంది డైరెక్టర్లను ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. మొత్తం 11 మందితో ఏర్పడిన జిల్లా నూతన కమిటీ కాల వ్యవధి ఐదేళ్లు ఉంటుందని ఎన్నికల అధికారి, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ) డి.ఫక్కీరప్ప తెలిపారు. 75 మంది సొసైటీ అధ్యక్షులకు ఓటు హక్కు ఉండగా 58 మంది హాజరయ్యారు. 11 డైరెక్టర్ పోస్టులకు 15 మంది నామినేషన్లు వేసినా... ఉపసంహరణ ప్రక్రియలో నలుగురు విత్‌డ్రా చేసుకున్నారు. చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక అవసరం లేకుండా పాలక వర్గం ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్మన్ పాటు డైరెక్టర్లుగా ఎంపికైన బి.రాజకుమార్, బి.గోవిందప్ప, టి.వెంకటేష్, ఎస్‌కే శ్రీనానాయక్, ఎం.బాలక్రిష్ణ, టి.రామక్రిష్ణ, రాజేష్‌నాయక్, బి.సూర్యనారయణ, టి.సూర్యనారాయణ తదితరులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాసనాయక్, ఎఫ్‌డీఓలు ఆసీఫ్, లక్ష్మీనారాయణ, బాబునాయక్, వీఎఫ్‌ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. నూతన పాలక వర్గానికి, చైర్మన్ ఎం.నగేష్‌కు సొసైటీ అధ్యక్షులు, సభ్యులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

- రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ నిర్మలమ్మ



వైద్య సేవలపై ఆరా తీస్తున్న నిర్మలమ్మ

కూడేరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ నిర్మలమ్మ అన్నారు. మంగళవారం కూడేరు మండలం కరుట్లపల్లిలో సర్పంచ్ ఓబులమ్మ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. కరుట్లపల్లి, తిమ్మాపురం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి వైద్య సేవలు పొందారు. రోగులకు మండల వైద్యాధికారి డాక్టర్ సౌమ్య రెడ్డి, నిపుణులు కుముద, చందన్, అర్జున్ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంహెల్‌హెచ్‌పీ మాధవి, ఏఎన్‌ఎంలు రాధిక, సావిత్రి, త్రివేణి, సుజాత, భాగ్యమ్మ, రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎంపీ చొరవతో స్వదేశానికి విద్యార్థి మృతదేహం

కళ్యాణదుర్గం రూరల్: లండన్‌లోని ఫిలిప్స్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థి కృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 21న మృతి చెందిన విషయం తెలిసిందే. స్థానిక వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సురేష్, నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఎంపీ తలారి రంగయ్య వెంటనే బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, కృష్ణ (22) మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు చొరవ తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బుధవారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామానికి కృష్ణ మృతదేహం చేరనుంది.

నవవధువు ఆత్మహత్య కేసులో నలుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరులో నవవధువు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ మంగళవారం తెలిపారు. ఎగువపల్లికి చెందిన దేవేంద్ర కుమార్తె పూజిత (22)కు ఐదు నెలల క్రితం పాత కల్లూరుకు చెందిన లోకేష్‌తో వివాహమైంది. ఈ క్రమంలో అత్తారింటికి వెళ్లిన పూజితను భర్తతో పాటు అత్త ఈశ్వరమ్మ, మామ మల్లికార్జున, మరిది మహేంద్ర వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బాధిత తండ్రి దేవేంద్ర ఫిర్యాదు మేరకు లోకేష్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, పురుషోత్తం యాదవ్, పామిడి ఎంపీపీ బోగాతి మురళీమోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలున ప్రారంభించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఏటా రంగనాథుడి బ్రహ్మోత్సవాల అనంతరం వృషభాల బలప్రదర్శన పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. పోటీలకు జిల్లా నుంచే కాక కర్నూలు, మహబూబ్‌నగర్, ఒంగోలు, వైఎస్సార్ జిల్లాల నుంచి మేలు జాతి వృషభాలను రైతులు తీసుకువచ్చారని నిర్వాహకులు తెలిపారు. పోటీలు మూడు రోజులు కొనసాగుతాయన్నారు.



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

మొదటి రోజు ఆరు పళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో మొత్తం 27 జతల వృషభాలు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధిక, సర్పంచ్ రుక్మిణమ్మ, నాయకులు పుల్లారెడ్డి, సుధాకర్, బేడల వెంకట్రాముడు, ఎస్సీ రంగయ్య, లాలునాయక్, రఘునాథ్‌రెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి నైపుణ్యాలు మెరుగు పరచుకోండి



మాట్లాడుతున్న అనురాధ

- ఖైదీలకు సూచించిన నాబార్డ్ డీడీఎం అనురాధ

బుక్కరాయసముద్రం: జీవనోపాధులపై నైపుణ్యత ఎంతో అవసరమని రిమాండ్ ఖైదీలకు నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి (డీడీఎం) అనురాధ సూచించారు. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని అనంతపురం జిల్లా జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలకు జీవనోపాధి నైపుణ్యాలపై మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 45 రోజుల పాటు మోటార్ రీవైండింగ్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనురాధ మాట్లాడుతూ... నాబార్డ్ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఇస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవనోపాధులు మెరుగు పరుచుకోవాలని సూచించారు. సామాజిక, ఆరోగ్య, ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ రహమాన్, శ్రీశక్తి వెల్ఫేర్ అధ్యక్షురాలు మహేశ్వరి, సైక్రియాటిస్ట్ విశ్వనాథరెడ్డి, సోషల్ వర్కర్ వరలక్ష్మి, సోషల్ కౌన్సిలర్ నాగరాజు, జైలర్లు వసంతకుమార్, నాగరాజు, డిప్యూటీ జైలర్లు చంద్రశేఖర్, నాగరాజు, హరీష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- వచ్చే విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్ల కేటాయింపు

బొమ్మనహాళ్: విద్యా హక్కు చట్టాన్ని (ఆర్‌టీఈ) అనుసరించి నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉంది. ఈ మేరకు ఆయా స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు ఈ పథకానికి అర్హులు. ఈ క్రమంలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులను చేర్చేలా ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేసింది.

పక్కాగా అమలు

గత టీడీపీ ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసింది. నిబంధనల మేరకు ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సి ఉండగా ఎక్కడా అమలుకు నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్ట చర్యలు తీసుకున్నారు. నిబంధనల మేరకు అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న వారిని ప్రభుత్వమే ఎంపిక చేస్తోంది. ఈ మేరకు 2023–24 విద్యాసంవత్సరంలో అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించారు. ఉచిత ప్రవేశాలకు నిరాకరించిన యాజమాన్యాలపై విద్యాశాఖ చర్యలకు సిద్ధపడడంతో విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించేందుకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందుకు వచ్చాయి.




మార్చి 14 వరకూ దరఖాస్తుల స్వీకరణ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ఏటా అర్హులైన పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్ కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ పటిష్ట చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ అమలవుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు.

దరఖాస్తుకు షెడ్యూల్ ఇలా...

- ఆసక్తి ఉన్న విద్యార్థులు http://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- మార్చి 14 వరకూ విద్యార్థుల వివరాల నమోదుకు అవకాశం కల్పించారు.
- మార్చి 20 నుంచి 22 వరకూ దరఖాస్తు అర్హతపై చెక్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది.
- ఏప్రిల్ 1న లాటరీ పద్ధతి ద్వారా తొలి విడత ఎంపిక జాబితా విడుదల చేస్తారు.
- ఎంపికైన విద్యార్థులకు ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ వరకు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు చేపడతారు.
- ఏప్రిల్ 15న లాటరీ పద్ధతి ద్వారా రెండో జాబితా విడుదల చేస్తారు.
- ఏప్రిల్ 16 నుంచి 23 వరకు ఆయా పాఠశాలల్లో ఎంపికైన విద్యార్థులు అడ్మిషన్లు పొందాలి.

పేద విద్యార్థులకు వరం



విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇది పేద విద్యార్థులకు ప్రభుత్వ కల్పిస్తున్న ఓ వరం. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు అర్హులు.

– మల్లికార్జున, ఎంఈఓ, బొమ్మనహాళ్

పెళ్లికి వెళుతూ మృత్యు ఒడికి...

చిలమత్తూరు: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరుకు చెందిన ఆదినారాయణప్ప (62) మరువకొత్తపల్లి బీసీ కాలనీ వద్ద ఉన్న ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుంటుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఘటనలో తలకు తీవ్ర గాయమై ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. 14 ఏళ్ల బాలుడితో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇష్టం లేని పెళ్లి - నవవరుడి ఆత్మహత్య

చిలమత్తూరు: ఇష్టంలేని పెళ్లి చేయడంతో మనస్తాపం చెందిన నవవరుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం కోడూరుకు చెందిన ప్రసాద్ (29)కు రెండు నెలల క్రితం పెళ్లి అయింది. తనకు ఇష్టం లేని పెళ్లి చేశారంటూ పలు సందర్భాల్లో నవవరుడు కుటుంబసభ్యులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం సుబ్బరావుపేట సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

'స్పందన'కు 15 ఫిర్యాదులు

అనంతపురం మెడికల్: డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని 15 ఫిర్యాదులు వచ్చాయి. ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత వివిధ పీహెచ్‌సీ, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఫిర్యాదులు స్వీకరించారు. జీతాల విషయానికి సంబంధించి హెడ్ అకౌంట్, తదితర వాటిలో మార్పులు చేసి సకాలంలో జీతాలందించేలా ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏఓ గిరిజామనోహర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'రికార్డులు సక్రమంగా లేకపోతే ఎలా?'



ఉపాధి హామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఏపీడీ అనురాధ

ఆత్మకూరు: చేసిన పనులకు సంబంధించి సక్రమంగా రికార్డులు లేకపోతే ఎలా అంటూ ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిపై ఏపీడీ అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీడీ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా చేసిన పనులకు ఫొటోలు ఎందుకు అప్‌లోడ్ చేయలేదని సిబ్బందిని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం అధికారులతో, సమావేశం నిర్వహించి పనులపై ఆరా తీశారు.

ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



నీలూరు రమణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: ఎస్‌టీయూ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సనప ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నీలూరు రమణారెడ్డిని మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిరంతరం సేవలు అందిస్తానని, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించండి




పి.యాలేరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు ప్రజలకు సూచించారు. మంగళవారం పి.యాలేరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని సబిహా సుల్తానా సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరోగ్యంరెడ్డి, వైస్ ఎంపీపీ నీలిమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

5న బహిరంగ వేలం

అనంతపురం కల్చరల్: జిల్లాలోని మరూరు టోల్‌గేట్, పీఏబీఆర్, గుత్తి మండలం సేవా ఫుడ్ క్షేత్రాల వద్ద పర్యాటక శాఖ నిర్మాణాలను ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలకు అప్పగించడానికి టూరిజం శాఖ వచ్చే నెల 5న బహిరంగ వేలం నిర్వహిస్తోంది. ఈమేరకు ఆశాఖ జిల్లా అధికారి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల్గిన వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి ఎదురుగా ఉన్న జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ ఫారాలు కూడా కార్యాలయంలో లభ్యమవుతాయని పేర్కొన్నారు.

కార్తికేయునికి మాఘమాస పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మాఘ మాసం సందర్భంగా పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం స్వామి మూల విరాట్‌కు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆకుపూజ, మహా మంగళహారతి చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తాం

- మరోసారి వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 17వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత ఎన్నికలకు ముంది ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమాన్ని అందించామని, రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి అండగా నిలిస్తే..రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 17వ డివిజన్‌లోని ప్రకాష్‌రోడ్డు, మల్లేశ్వరి రోడ్డు, వెంకటరెడ్డి కాలనీలో ఇంటింటా వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు ఎమ్మెల్యే అందించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో నగరంలోని ప్రధాన రోడ్లు బళ్లారి బైపాస్ నుంచి కలెక్టరేట్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, గుత్తి రోడ్డు నుంచి తడకలేరు, శ్రీకంఠం సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా గుత్తి రోడ్డు, జేఎన్‌టీయూ, విద్యుత్‌నగర్, సూర్యనగర్ తదితర ప్రాంతాల్లో విశాలవంతమైన రోడ్లను నిర్మించామన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను నిర్దేశిత సమయం కంటే ముందుగానే పూర్తి చేయడంతో ట్రాఫిక్ సమస్య తగ్గిందన్నారు. భవిష్యత్తులో కొన్నేళ్ల పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తదన్నారు. ఇక మురికివాడలు, వివిధ డివిజన్లలోనూ రోడ్లు, కాలువలను ఏర్పాటు చేశామన్నారు. పాతూరులాంటి ఇరుకు వీధుల్లోనూ రోడ్లు నిర్మించామన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు అందులో 8 స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులో ఉంచామన్నారు. గతంలో చిన్నపాటి సమస్య వస్తే కర్నూలు, బెంగళూరుకు పరుగులు తీయాల్సిన పరిస్థితి వచ్చేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రౌండ్ ద క్లాక్ వైద్యులు, స్టాఫ్‌నర్సులు తదితర సిబ్బందిని అందుబాటులో ఉంటూ జిల్లా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు.

రూ.300 కోట్లతో ఆస్పత్రి విస్తరణ

నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ సర్వజనాస్పత్రి విస్తరణకు ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. కొత్తగా మదర్ చైల్డ్ బ్లాక్(ఎంసీహెచ్), సర్జికల్ బ్లాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అప్పటి పాలకులు గ్రూపు రాజకీయాలతో కాలం వెల్లదీశారన్నారు. మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అబూసలేహ, నాగవినుత, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి,డైరెక్టర్ శోభారాణి, న్యాయవాది రాజశేఖర్ యాదవ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, సైపుల్లాబేగ్, నాయకులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, అమర్‌నాథ్, శుకూర్, రియాజ్, విక్రమ్, లోక, గుజరి వెంకటేష్, చెన్నారెడ్డి, కేశవరెడ్డి, రామకృష్ణ, అనిల్‌కుమార్‌గౌడ్,పీవీ గోపాల్ చౌదరి, మిద్దె నగేష్, దేవి, పార్వతి, శోభాబాయి, భారతి, ప్రసన్నలక్ష్మి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

'విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు'

ఆత్మకూరు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దంటూ రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలపై ఆర్ఓ, డిప్యూటీ కలెక్టర్ వసంత్‌బాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందికి, బీఎల్ఓలకు ఉదయం 10 గంటలకు సమావేశం ఉందని ముందే తెలిపారు. ఆర్ఓ ఉదయం 9.50 నిమిషాలకే కార్యాలయానికి వచ్చారు. కాని బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది ఉదయం 10.30 గంటలు దాటినా సమావేశానికి రాకపోవడంతో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విధులను అలా ఎలా నిర్లక్ష్యం చేస్తారు? సమావేశం ఉందని ముందే చెప్పినా ఇంత నిర్లక్ష్యం వహిస్తారా? అంటూ మండిపడినట్లు సమాచారం. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉండాలని, 1,500 మందికి మించి ఓటర్లు ఉంటే రెండు పోలింగ్ బూత్‌లుగా విభజించాలని సూచించారు. మండలంలోని గొరిదిండ్లలోని 20 వ పోలింగ్ బూత్ ఒక్కటే 1,500 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా ర్యాంపులు ఏర్పాటు చేయాలని, పెయింటింగ్, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉన్నాయా ? లేదా ?అన్న విషయాలను పరిశీలించాలన్నారు. బీఎల్ఓలు ఫారం–6, ఫారం–7వ ప్రత్యేకంగా పరిశీలించాలని ఆదేశించారు.

నిత్య చైతన్య దీపిక జన విజ్ఞాన వేదిక

- శాస్త్రీయ దృక్పథమే లక్ష్యంగా నిర్మాణం
- సందర్భం: నేడు జాతీయ సైన్సు దినం



ట్రిక్కును ప్రదర్శిస్తున్న తరిమెల అమరనాథరెడ్డి బృందం



విద్యార్థులను చైతన్యవంతం చేస్తున్న ప్రదర్శన(ఫైల్)

అనంతపురం కల్చరల్: కంప్యూటర్ యుగంలో ప్రయాణిస్తున్నా అంధ విశ్వాసాలు వీడడం లేదు..మూఢ నమ్మకాలు ఇంకా పట్టి పీడిస్తూనే ఉన్నాయి. కులం, మతం అంటూ మధ్యయుగ కాలం ఛాందసాలతో సాగే సమాజానికి కరదీపికలా జనవిజ్ఞాన వేదిక నిత్య చైతన్యం చేస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం గావిస్తోంది. బాగా చదువుకున్న వారు కూడా అశాస్త్రీయ ఆలోచనలతో సమాజాన్ని నింపేస్తుంటే దానికి భిన్నంగా జన విజ్ఞాన వేదిక తమ కార్యాచరణతో పరిసరాలను చైతన్యం చేయడానికి నిత్యం కృషి సాగిస్తోంది. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవడితేనే భవిష్యత్ తరాలు మూఢనమ్మకాలు లేని సమాజాన్ని నిర్మించవచ్చన్న ఆలోచనలతో ముందుకు సాగుతోంది.

సైన్సు ప్రచారమే లక్ష్యంగా..

సైన్సు పట్ల అవగాహన పెంచడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక ఆవిర్భవించింది. ఈనాడు సైన్సుకు పర్యాయపదంగా మారిపోయిన జేవీవీ 1988 ఫిబ్రవరి 28న ఏర్పడింది. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ వెంకటరెడ్డి, ఆచార్య సుబ్బరంగయ్య, ఆచార్య మాలకొండయ్య వంటి మేధావులు అనంత వేదికగా గొప్ప వేదికను అందించారు. రచయితలు, కళాకారులు, కవులతో పాటూ పలు వృత్తుల వాళ్లు సైన్సు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈనాటికీ రాధాకృష్ణమూర్తి, ఆనందరావు, రాజమోహన్ లాంటి వారు ప్రధాన భూమిక పోషిస్తున్న జేవీవీ అనేక ఉద్యమాల్లో కీలక భాగస్వామిగా మారింది. ముఖ్యంగా విద్యార్థి దశను అర్థవంతంగా మార్చడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. టీచర్లకు శిక్షణనిస్తూ ప్రగతిశీల సమాజం కోసం అవిరామంగా పని చేస్తోంది. ఇంత కృషి ఉంది కాబట్టే జిల్లాకు చెందిన డాక్టర్ గేయానంద్ జేవీవీ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికై అనంత ఖ్యాతిని మరింత ఘనంగా చాటారు.

సమాంతరంగా మానవత

సాధారణంగా మహత్యాలంటూ సామాన్యజనాన్ని బురిడీ కొట్టించే దొంగ సన్యాసులు, ఫకీర్లకు, పాస్టర్లకు వ్యతిరేకంగా సామాజిక సేవా కార్యకర్త తరిమెల అమరనాథరెడ్డి పోరాటం చేస్తున్నారు. దేవుడి నమ్మకం తప్పు కాదు కానీ భగవంతుని పేరుతో మూఢనమ్మకాలతో సాగే దోపిడీకి వ్యతిరేకంగా చైతన్యం చేయడంలో ఆయన నాలుగు దశాబ్దాలుగా నిర్విరామ కృషి చేస్తున్నారు. సైన్సు ప్రచారం కోసం కొంతమంది కార్యకర్తలతో కలిసి మానవతా సంస్థను ఏర్పాటు చేసిన అమరనాథరెడ్డి రక్తదాతగా ఎంత ప్రాముఖ్యం పొందారో అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా సాగే సదస్సులు, సమావేశాలు, కళాజాతాల్లో ఆయన నిత్యం పాల్గొంటూ స్ఫూర్తినందిస్తున్నారు. గాలిలో నుంచి బూడిద రాల్చడం, సలసల కాగే నూనె నుంచి బజ్జీలు తీయడం, వంటి ట్రిక్కులు మహిమలు కావని అవన్నీ సైన్సు చెప్పే పాఠాలేనని బోధిస్తున్నారు. హేతువాద సంఘం ఆపై జన విజ్ఞాన వేదిక ఆరంభం నుంచి ఉండి తర్వాత మానవత సంస్థ ద్వారా సాగిస్తున్న కృషి , చేసే ప్రసంగాలు అందరికీ స్ఫూర్తినందిస్తున్నాయి.

నేడు జాతీయ సైన్సు దినోత్సవం

ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ చంద్రశేఖర వెంకట్రామన్ (సీవీ రామన్) రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజైన ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు దినోత్సవం దేశమంతటా చైతన్యస్ఫూర్తితో జరుపుకుంటోంది. ఆ నేపథ్యంలో నగరంలోనూ బుధవారం జేవీవీ కార్యాలయంతో పాటూ పాఠశాలలు, కళాశాలలు, కళావేదికలపై సైన్సు దినోత్సవం ఘనంగా జరుగనుంది. జనవిజ్ఞాన వేదిక సభ్యులు ప్రత్యేకంగా ప్రజా చైతన్యం కోసం వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

తాగునీటి సమస్య రానివ్వం



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వమని, వచ్చే నెల 10తేదీ నాటికల్లా పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేస్తామని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఇంజినీరింగ్ అధికారులతో కలసి మేయర్ విలేకరులతో మాట్లాడారు. నెల రోజుల వ్యవధిలోనే నీరు పంపింగ్ చేసే రెండు మోటర్లు కాలిపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. 2010లో కొనుగోలు చేసిన రెండు మోటర్లు మాత్రమే ఉండగా తమ పాలకవర్గం వచ్చిన తర్వాత రూ.80 లక్షలతో స్టాండ్ బై మోటర్‌ను కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం తాము కొనుగోలు చేసిన మోటర్, మరో పాత మోటర్ ద్వారా పంపింగ్ చేస్తున్నామన్నారు. ఉన్నఫలంగా రెండు మోటర్లు కాలిపోవడంతో ఇంజినీరింగ్ అధికారులు బెంగళూరుకు మోటర్లను తీసుకెళ్లి మరమ్మతులు చేయించే ప్రయత్నం చేశారన్నారు. వాస్తవంగా ఒక మోటరు రిపేరీకి 45 రోజుల వ్యవధి పడుతుందని, ప్రత్యేక చొరవ తీసుకుని పది రోజుల్లో రిపేరీ చేయించేలా అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న మోటర్లతో పంపింగ్ కొనసాగిస్తే..అవి కాలిపోయే ప్రమాదం ఉందని, దీంతో ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు పంపింగ్‌ను ఆపుతున్నట్లు తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

నగరపాలక సంస్థ సరఫరా చేసే నీటితో పాటు అదనంగా వివిధ డివిజన్లలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ తెలిపారు. కేవలం మోటర్ల రిపేరీతో నీటి సమస్య వచ్చిందన్నారు. పీఏబీఆర్ డ్యాంలో నీరు పుష్కలంగా ఉందన్నారు. భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో నూతన మోటర్‌ను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఎస్ఈ రామమోహన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ నాటికి నీటి సరఫరా యాథాస్థితికి తీసుకొస్తామన్నారు. కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సైఫుల్లాబేగ్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో జాగరణ ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ధర్మప్రచార మండలి సభ్యులు

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జాగరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ ధర్మప్రచార మండలి ప్రతినిధులు శ్రీపాద వేణు, నాగేశ్వరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం జాగరణ ఉత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేనెల 8న శివరాత్రి పర్వదినం స్థానిక టీటీడీ కల్యాణమండపంలో ఉదయం విశేష పూజలతో పాటూ రాత్రి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 108 పాదరస శివలింగాలకు పూజలు నిర్వహించి వాటిని లాటరీ పద్ధతి ద్వారా భక్తులకందిస్తామన్నారు. శివపారాయణం, లింగోద్భవ పూజలు ఉంటాయని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధర్మప్రచార మండలి సభ్యులు మధు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



జేడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం రూరల్: విద్యార్థినుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న నగరంలోని అరవింద్ నగర్ ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావును కోరారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు జేడీని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ వార్డెన్ నాగలక్ష్మి విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మెనూ సక్రమంగా అందించకుండా విద్యార్థినుల పొట్టగొడుతోందన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కో–కన్వీనర్ రజిత, నగర అధ్యక్ష, కార్యదర్శులు శివ, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

7,425 ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డుల పంపిణీ



మరుట్లలో ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డు అందజేస్తున్న ఏఎన్ఎం సావిత్రి

కూడేరు: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో మంగళవారం నాటికి 7,425 కార్డులను ప్రజలకు అందించినట్లు ఎంపీడీఓ ఎంకే బాషా, మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. 9,579 ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు ప్రభుత్వం నుంచి వచ్చాయి. కూడేరు సచివాలయం–1లో 943 సరఫరా కాగా 863 పంపిణీ చేశారు. చోళసముద్రంలో 783 రాగా 673, కూడేరు–2లో 662 గాను 580, ఇప్పేరులో 1,517 గాను 1247, పి.నారాయణపురంలో 7,88 గాను 460, గొటుకూరులో 604గాను 280, ఉదిరిపికొండలో 378 గాను 315, కమ్మూరులో 1,019 గాను 853, మరుట్లలో 1,326 గాను 1118, తిమ్మాపురంలో 609 గాను 555, కొర్రకోడులో 950గాను 481 మందికి పంపిణీ చేశారు.

భక్తిమార్గంతోనే ఉత్తమ జీవితం



స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న పండితులు, భక్తులు

అనంతపురం కల్చరల్: భక్తిమార్గంతోనే మానసిక ప్రశాంతత కలిగి ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గోవిందానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. నగరంలోని కామితార్థ గణపతి ఆలయంలో జరుగుతున్న విగ్రహ పునఃప్రతిష్ఠకు స్వామీజీ హాజరై అనుగ్రహ భాషణం చేశారు. ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అంతకు ముందు ఆలయంలో షోడశోపచారపూజలు, వేదపారాయణం, గణపతి, నవగ్రహ, రుద్ర, అరుణ, దుర్గా పారాయణాలు, మూలమంత్ర జపాలు ఘనంగా జరిగాయి. అనంతరం చిన్నారులు శాస్త్రీయ నాట్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం కర్ణాటకలోని గోపాలకృష్ణ మఠం నుంచి నగరానికి విచ్చేసిన స్వామీజీకి కాశీవిశ్వేశ్వర కోదండరామాలయ అనువంశిక ధర్మకర్త హోసూరు రామసుబ్రమణ్యం ఇంట్లో విడిది చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామీజీ గురు పాదపూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సుంకేశుల సత్యనారాయణ మాట్లాడుతూ బుధవారం ఆలయంలో స్వామీజీ చేతుల మీదుగా సర్వదేవతల పునః ప్రతిష్ఠలుంటాయన్నారు.

ప్రతి విద్యార్థికీ హాల్ టికెట్ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఫీజుతో సంబంధం లేకుండా ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు ఫీజు పూర్తి చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామంటూ వేధిస్తున్నాయన్నారు. ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతున్నా...రెసిడెన్షియల్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యాజమాన్యాలు ఆ అవకాశం ఇవ్వడం లేదన్నారు. ఇంటర్ బోర్డు అధికారులు తక్షణమే ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు, ఉపాధ్యక్షులు వంశీ, నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నాయకులు చందు, హరికృష్ణ, ఆనంద్, రారాజు, అశోక్, ప్రసన్న పాల్గొన్నారు.

బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని మస్రో సత్రం సమీపంలో మంగళవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న వైటీ చెరువుకు చెందిన రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు.

రీసోర్స్ కోఆర్డినేటర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎర్రనాగప్ప

పుట్లూరు: స్వచ్ఛ భారత్ మండల రీసోర్స్ కోఆర్డినేటర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా పుట్లూరు మండల కో ఆర్డినేటర్ కడవకల్లు ఎర్రనాగప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం అనంతపురంలో నిర్వహించిన కోఆర్డినేటర్ల సమావేశంలో తనను యూనియన్ అధ్యక్షులుగా ఎన్నుకోవడంపై ఎర్రనాగప్ప హర్షం వ్యక్తం చేశారు. తోటి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

హుండీ కానుకల లెక్కింపు వాయిదా

గుంతకల్లురూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం చేపట్టాల్సిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు ఈఓ భద్రాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 5న హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ మంగళవారం తెలిపారు. కళాశాలలో ఇండో ఎంఐఎం పూల్ ప్రతినిధులు బసవ రాజ్, డిప్యూటీ మేనేజర్ నటరాజ్, సందేశ్, సందీష్ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఎస్ఆర్ఐటీ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు రూ.3.2 లక్షలు వేతనంతో సీటీసీతో కలిపి ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్‌తో పాటు టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, యాజమాన్యం అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సెబ్ సీఐ శివకుమార్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం తాడిపత్రి మండలం గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్ పెన్నానది నుంచి ఐదుటన్నుల ఇసుకతో యాడికి మండలం తిప్పారెడ్డిపల్లె మీదుగా రవాణా చేస్తుంటే పట్టుకుని సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

శింగనమల: ఓటరు జాబితా తప్పులు లేకుండా అందిస్తామని శింగనమల నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి శ్రీను వెన్నల అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాజకీయ పార్టీల తరఫున ఒక్కొక్కరికి ఆహ్వానం పంపారు. అయితే టీడీపీ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎక్కువ మంది హాజరవడంతోపాటు అవగాహన లేని ప్రశ్నలు వేయడంతో అధికారులు విస్తుపోయారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల వరకూ ఫిర్యాదుల నమోదుకు శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో ఒక అధికారిని నియమిస్తామన్నారు. తహసీల్దార్ శోభన్‌బాబు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, సిబ్బంది ఉదయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు నల్లప్ప, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.